క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయిచరణ్‌కాలనీకి చెందిన వెంకటేష్ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.2.5లక్షల చెక్కును మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ లబ్ధిదారుడి కుటుంబీకులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసాను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు బీజేపీ



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ చేపట్టిన ప్రజాయాత్ర మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాకు గురయ్యాయని అన్నారు. పరిసర ప్రాంతాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల తెలిపి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, ఆంజనేయులు, శ్రీనివాస్ పంతులు, సీతారామరాజు పాల్గొన్నారు.

మూసాపేట విశ్వకర్మ సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

మూసాపేట: విశ్వకర్మ సంఘం మూసాపేట నూతన కమిటీ సభ్యులను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుంకోజు వీరాచారి, ఉపాధ్యక్షుడిగా వజ్రాల నవీన్‌కుమార్ చారి, నల్లనాగుల నరేష్‌చారి, జీఎస్ పొత్తునూరి సురేష్‌చారి, జాయింట్ సెక్రటరీ రాళ్లబండి వెంకటాచారి, ట్రెజరర్ రాళ్లబండి శివాచారి, అడ్వైజర్ వడ్ల వేణుగోపాలాచారి, సోమయ్యచారిని ఎన్నుకున్నారు. అదే విధంగా ఆలయ కమిటీ నూతన సభ్యులను సైతం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలమాకుల అశోక్ చారి, వైస్‌చైర్మన్ దాసోజు శ్రీనివాసాచారి, బొడ్డుపల్లి గోవిందాచారి, జీఎస్ నాగోజీ శ్రీనివాసాచారి, జెఎస్ కమ్మరి రఘు చారి, ట్రెజరర్ వడ్ల కృష్ణయ్యచారి, అడ్వైయిజర్ శ్రీనివాసాచారి, దాసోజు బాబుచారిని ఎన్నుకున్నారు.

మే 10 నుంచి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో నిర్మిస్తున్న శ్రీ శివరామాంజనేయ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కుంబాభిషేక మహోత్సవాలు మే 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మానుక మహేష్ యాదవ్ పేర్కొన్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి రాఘవేందర్ మాట్లాడుతూ.. 2015లో ఆలయం పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కోవిడ్ మహమ్మారి కారణంగా ఆలస్యం జరిగిందన్నారు. ఆలయ నిధులపై కబీర్‌నగర్ మాజీ అధ్యక్షుడు కడపాన గోపాల్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆనంద్‌రెడ్డి, ఆలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్, నాయకులు వీరస్వామి, ఉపేందర్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీధర్, చాణిక్య, దుర్గారావ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కూకట్‌పల్లి: మూసాపేటకు చెందిన నర్సింహయాదవ్‌ను ఐఎన్‌టీయూసీ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఎన్‌ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్‌మిస్బా, మేకల రమేష్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, నాగార్జున, ఫణీంద్ర, వంశీ, చందు తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారమే ధ్యేయంగా

‘పబ్లిక్ కాంటాక్ట్’



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, అధికారులు

- కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్లు, అధికారులు
- నేరుగా కాలనీ, బస్తీల్లోని సమస్యల పరిశీలన
- సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు

బాలానగర్: కాలనీ పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోమటి బస్తీలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొని సమస్యలను నేరుగా తెలుసుకుంటారని తెలిపారు. సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మొహ్మద్ రషీద్, వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, ఎస్ఆర్‌పీ నాగేశ్వర్ నాయక్, వర్కు ఇన్‌స్పెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో..



కాంటాక్ట్‌లో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, వర్‌టెక్స్ ప్రెస్టేజీ, జై భారత్‌నగర్‌లలో జరిగిన కాలనీ కాంటాక్ట్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీల్లోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీహెచ్‌ఎంసీ, వివిధ శాఖల అధికారులతో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రత్యక్షంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించడానికి ఇది చక్కటి వేదిక అని అన్నారు. సుమారు 15 డిపార్టుమెంట్ అధికారులు ఒకే వేదికను పంచుకోవడం జరుగుతోందన్నారు. మీ కాలనీలో సమస్యలను అధికారులకు విన్నవించి పరిష్కరించుకోటానికి ఇది చక్కని మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మహేందర్ రెడ్డి, ఏఈలు రాజీవ్, ప్రశాంతి, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ముస్తఫా, వీధి లైట్ల సూపర్‌వైజర్ సుధాకర్, లైన్‌మెన్ ఖాళీ, హార్టికల్చర్ దాసు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్‌లో...

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లోని పలు ప్రాంతాల్లో కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రోజాదేవి పలు శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మెంబర్స్, ప్రజలతో వివిధ సమస్యలపై చర్చించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా కరెంటుకు సంబంధించిన అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారన్నారు. అదే విధంగా డ్రైనేజీ, రోడ్లు వంటి విషయంలో కొన్ని పనులు శాంక్షన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా చెత్తా చెదారం తరలించటం లేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. పెట్రోలింగ్ చేయాలని స్థానికులు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఆశ, వినయ్‌కాంత్‌రెడ్డి, వర్కు ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, విద్యుత్, జలమండలి సిబ్బంది నాగరాజు, సత్యనారాయణ, పోలీస్ శాఖ పాండురంగాచారి, ఎస్ఎఫ్ఏ తులసీదాస్, రాంకీ ఎస్ఎఫ్ఏ రజిని తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరనగర్‌లో జరిగిన కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో..

ఆల్విన్‌కాలనీ: పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని సమస్యలను తెలుసుకోవడానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతికాలనీ, బస్తీ రెసిడెంట్స్, వెల్ఫేర్ అసోసియేషన్లలోని పలు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వివిధ శాఖల అధికారులతో కలిసి సమస్యలు పరిష్కరించే విధంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కాలనీలోని సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేసుకునేందుకే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శ్రీనివాస్, రాజేష్ చంద్ర, పాండుగౌడ్



కార్యక్రమంలో పాల్గొన్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యం

బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: ప్రజలు పడుతున్న ఇబ్బందులు వినడానికి మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పార్టు 2లోని పాపిరెడ్డినగర్‌లో శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ చేపట్టిన పాదయాత్రకు పలువురు స్థానికులు నీరాజనాలు పట్టారు. స్థానికుల నుంచి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అధిక పన్నులు కడుతున్నటువంటి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, వృద్ధుల పెన్షన్లు కొరత, కుక్కల బెడద, వీధిదీపాల సమస్య, అంగన్‌వాడీ కేంద్రాల లోటు, అంగన్‌వాడీ సిబ్బంది, బస్తీ దవాఖానాల్లోని సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. అన్ని వసతులు ఉన్నా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఆస్‌బెస్టాస్ కాలనీలో లేఔట్స్ వేసిన ఇళ్లకు రెగ్యులైజేషన్ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని యోగానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు పలుమార్లు తెలియచేసినా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కబ్జాలు తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, మురళి, నర్సింగ్‌రావు, పర్వతాల యాదవ్, మహేష్‌యాదవ్, ప్రభాకర్‌యాదవ్, గోవర్ధన్‌చారి, రాములు, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పాపిరెడ్డినగర్ పాదయాత్రలో చిన్నారితో కరచాలనం చేస్తున్న గజ్జల యోగానంద్

జాతీయ జెండాకు అవమానం!

బాలానగర్: బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండాకు అవమానం జరిగింది. కార్యాలయంలోని చెట్ల పొదల్లో జాతీయ జెండాను చూసిన కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో పలువురు జాతీయ జెండాను భద్రపర్చాల్సిన సిబ్బంది చెత్త కుప్పలో పడేశారని.. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ‘సాక్షి’ బాలానగర్ తహసీల్దార్ అహల్యను వివరణ కోరింది. తాము కార్యాలయంలోని జాతీయ జెండాను తొలగించి భద్రపర్చామన్నారు. అదే విధంగా ఎవరో ఇక్కడ పడవేసిన జాతీయ జెండాను కూడా భద్రపర్చినట్లు తెలిపారు.

దివ్యాంగుడికి వాహనం అందజేత

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్టోరల్ పరిశోధక విద్యార్థి హర్ష్‌రాజ్‌కు త్రీవీలర్‌ను మంగళవారం డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్(ఈసీడీఏపీ) ఎంపవర్డ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రామస్వామి అందించారు. ఈసీడీఏపీ అనేది హెచ్‌సీయూలో దివ్యాంగ విద్యార్థులు, సిబ్బంది యొక్క ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన విభాగం. ఇప్పటికే మూడు చక్రాల స్కూటర్, బ్యాటరీ వీల్‌చైర్‌ను కొనుగోలు చేసింది. లోకోమోటర్ వైకల్యాలున్న విద్యార్థులకు అందజేస్తారు

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



హెచ్ఎఎల్ పార్కు సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కాలనీలలో నెలకొన్న ప్రతి సమస్యపై శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తెలిపారు. కాలనీ ప్రజలతో ముఖాముఖి-సమస్యల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ కాలనీవాసులతో ఆయన సమావేశమయ్యారు. హెచ్ఏఎల్ కాలనీలో పార్కు అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు, వాచ్‌మెన్ నియమాకం, బీటీ రోడ్డు నిర్మాణం, పార్కులో బోర్‌వెల్ రిపేర్, పారిశుద్ధ్య నిర్వాహణ, ఎంఎంఆర్ గార్డెన్ దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులతో చర్చించారు. సాయి నారాయణపురి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఎలక్ట్రికల్ సమస్యలు, శానిటేషన్ సమస్యలు, శంకర్ ఎన్‌క్లేవ్‌లో మంచినీటి సమస్య, కమ్యూనిటీహాల్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు.

కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు రాంబాబు, రాజ్‌కుమార్, శేఖర్, నర్సింహ, సుధాకర్‌రెడ్డి, ప్రబాకర్, గణేష్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, మహేందర్‌నాథ్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ



తోఫాను అందజేస్తున్న కార్పొరేటర్ శిరీష



తోఫాలు అందజేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

మూసాపేట: హబీబ్‌నగర్, వివేక్‌నగర్‌లలో మంగళవారం ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫాలను కార్పొరేటర్ శిరీష ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖదీర్, హబీబ్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు యధుల్, కరీన్ సాబ్, ఫియాజ్, రషీద్, ఇద్రిస్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీ: ముస్లింలకు రంజాన్ తోఫాలను మంగళవారం కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో సర్వమతాలకు సమ ప్రాధాన్యం లభిస్తోందన్నారు. అన్ని మతాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మస్తాన్, ఇబ్రహీం, అమీన్, లియాకత్ ఆలీ, రెహమాన్, నజీర్, రజియా బేగం, మున్వర్, జాన్వీ బేగం, ఫైమా, నగిన, హజ్రా, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి

బాలానగర్: వేసవి సెలవులలో దొంగతనాల నివారణకు సైబరాబాద్ పోలీసుల ముఖ్య సూచనలను తెలియజేసే కరపత్రాన్ని మంగళవారం బాలానగర్ పోలీసులు పంపిణీ చేశారు. ఈ కరపత్రంలో వేసవి సెలవులను పురస్కరించుకొని ఎవరైనా ఊరు వెళితే మీ విలువైన బంగారు, వెండి ఆభరణాలను, డబ్బులను బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్, తాళం అమర్చుకోవటం మంచిదని తెలిపారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే మీ దగ్గరలోని పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదా 100కు ఫోన్ చేయాలన్నారు. వాహనాలను ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.



ఊరెళ్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలానగర్ పోలీసులు పంపిణీ చేసిన కరపత్రంతో స్థానికులు

ఇన్‌సోఫ్ ఎదుట విద్యార్థుల ఆందోళన

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని ఇన్‌సోఫ్ డేటా సైన్స్ ట్రైనింగ్ సెంటర్ ఎదుట ఆ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. బ్యాంక్ లోన్ తీసుకొని డేటా సైన్స్‌లో శిక్షణ తీసుకునేందుకు 9 నెలల కోర్సులో చేరామని బాధితులు తెలిపారు. ఇంటర్న్‌షిప్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తమను తొలగిస్తున్నామని మెయిల్ పంపడంతో ఏం చేయాలో అర్థం కాక ఆందోళనకు దిగినట్టు బాధితులు వాపోయారు.

అందరికీ సర్టిఫికెట్లు..

డేటా సైన్స్ ట్రైనింగ్‌లో చేరిన వారు బ్యాంకు లోన్ ద్వారా ఫీజులు చెల్లించారు. బ్యాంక్ ఈఎంఐ కోసం ప్రతి నెల స్టైఫండ్ ఇస్తున్నట్టు ఇన్‌సోఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ దక్షిణామూర్తి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ రాకపోవడంతో బ్యాంక్ లోన్‌ను తామే భరిస్తున్నామని, శిక్షణ తీసుకుంటున్న 700 మంది విద్యార్థులకు లోన్ ఉందని అందరికి బ్యాంక్‌లోన్ తీర్చినట్టు ఎన్‌ఓసీ ఇస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కారణంగా ప్రాజెక్టులు రాకపోవడంతో ప్లేస్‌మెంట్ ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు డేటాసైన్స్ కోర్సు సర్టిఫికెట్, బ్యాంక్ లోన్‌ను తామే చెల్లిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే 220 మందికి లోన్ చెల్లించామన్నారు. కాగా ఆందోళన విషయం తెలిసి రాయదుర్గం పోలీసులు సంస్థ వద్దకు వెళ్లి ఆరా తీశారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ మహేష్ తెలిపారు.

నేడు దిశా కోర్డ్ స్కూల్ బిల్డింగ్ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని దిశా కోర్డ్ స్కూల్ బిల్డింగ్‌ను బుధవారం బెర్కాడియా సీఈఓ జస్టిన్ వీలర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మంత్రి కేటీఆర్, గౌరవ అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, బెర్కాడియా సీఆర్ఈ మార్క్ మెక్‌కూల్, మేనేజింగ్ డైరెక్టర్, సుదీప్తో ముఖర్జీ, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కోర్డ్ ఫౌండర్, అధ్యక్షుడు సుమన్ సి. మల్లాది, కోర్డ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ మంజులత మల్లాది పాల్గొనున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

జోనల్ కమిషనర్ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత మంగళవారం ఉపకమిషనర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ సిటి ప్లానర్స్‌కు సంబందించిన సర్కిల్‌లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పురాతన భవనాలను గుర్తించి, వాటన్నిటికి నోటీసులు జారీ చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా సెల్లార్‌లకు సంబంధించి రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలు జరగకుండా ఉండడానికి బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ ప్రాంతాలలోని సెల్లార్‌లలో నిర్మాణ కార్మికుల శిబిరాలను ఏర్పాటు చేసుకోకుండా చూసుకోవాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి అన్ని సర్కిల్‌లలో రెడ్ కెటగిరి వాణిజ్య సముదాయాలను గుర్తించి వాటికి సంబంధించి పారిశ్రామిక వాడల్లో మూడు నెలలలోపు తరలించడానికి నోటీసులు జారీ చేయాలన్నారు. వీటిని తరలించే వరకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్స్‌ను ఆదేశించారు.

◆ అందుకు సంబంధించిన ఫైర్‌సేఫ్టీ కరపత్రాలను అన్ని వాణిజ్య సముదాయాల వారికి అందించాలన్నారు. అదే విధంగా ఇతర వాణిజ్య సముదాయాలను గుర్తించేందుకు సర్కిల్‌కు ఒక టీమ్‌ని ఏర్పాటు చేసి వివరాలు సేకరించి వారందరికీ ఫైర్ సేఫ్టీ కరపత్రాలను అందజేసి అగ్ని ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రంజాన్ పురస్కరించుకొని మసీదు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు వీలుగా కవర్లు, పారిశుద్ధ్య కార్మికులకు రేడియం జాకెట్లు అందచేశారు. ఈ సమావేశంలో జోనల్ సిటీ ప్లానర్ కె.ఉమాదేవి, ఉపమిషనర్లు రవికుమార్, రవీందర్ కుమార్, మంగతాయారు, ప్రశాంతి, నాగమణి, సహాయ మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌సీ మమత



మసీదు నిర్వాహకులకు కవర్లు అందజేస్తున్న జెడ్‌సీ, అధికారులు

అపార్ట్‌మెంట్లలో సీపీఆర్‌పై శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటు, ఇతరత్రా అత్యవసర స్థితిలో ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగించే కార్డియోపల్మనరీ రెస్యూసిటేషన్ (సీపీఆర్) ప్రథమ చికిత్సపై నివాసిత సంఘాలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం గచ్చిబౌలిలోని ప్రెస్టీజ్ హైఫీల్డ్స్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ విజయ్ భాస్కర్, రియాజుద్దీన్, ఇతర సాంకేతిక సిబ్బంది సీపీఆర్ ప్రాముఖ్యత, అత్యవసర వైద్య పరిస్థితికి ఎలా స్పందించాలి? ప్రాథమిక చికిత్స పద్ధతులను వివరించారు. ఐఆర్‌సీఎస్ భవిష్యత్తులో సీపీఆర్‌పై ఎంపిక చేసిన సభ్యులకు సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఐఆర్‌సీఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అమృత ఫౌండేషన్ డైరెక్టర్ డా.దేవికారాణి, ప్రెస్టీజ్ మేనేజ్‌మెంట్ పాల్గొన్నారు.